# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం। 18। ఏప్రిల్। 2023





**సంక్షేమ ప్రదాత సీఎం జగన్**

రాష్ట్రంలో సంక్షేమ ప్రదాతగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. 8లో



**మలేరియా నివారణకు చర్యలు**

మలేరియా నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గూడెంకొత్తవీధి పీహెచ్‌సీ వైద్యాధికారి అచ్యుత్ అన్నారు. 8లో



**ఆన్‌లైన్‌లో చందనోత్సవం టికెట్లు**

అప్పన్న చందనోత్సవం టికెట్లు మంగళ వారం నుంచి ఆన్‌లైన్‌లో లభ్యమవుతాయని దేవస్థానం ఈవో త్రినాథరావు తెలిపారు. 8లో

# గుడి.. బడి.. గోదావరి

**పుట్టి పెరిగిన ఊరుపై మమకారం ఉన్నా మూడేళ్ల క్రితం వదిలి పోవాల్సి వచ్చింది... ఉన్న ఊరికి ఒక్కసారి అయినా పోయి రావాలి ...పొలాలు ఇల్లు తనివి తీరా చూసి రావాలి. సొంత ఊరితో పెనవేసుకున్న మధుర జ్ఞాపకాలు నెమరు వేసుకోవాలి... ఒక రోజైనా సొంత ఊరిలో గడిపి అప్పటి ఆనందాన్ని అందిపుచ్చుకోవాలి.. అన్న ఆలోచన వచ్చిందే తడవుగా పోలవరం** నిర్వాసితులు పుట్టి పెరిగిన గ్రామాలకు తరలి వెళ్తున్నారు. ఎన్నో ఏళ్ల అనుబంధం పెనవేసుకున్న ఇంటికి చేరి కబుర్లు చెప్పుకుంటూ వంటావార్పు చేసుకుంటున్నారు. గుడిని, బడిని గోదావరిని తనివి తీరా చూసి జ్ఞాపకాలు నెమరు వేసుకొని తిరిగి పునరావాస కాలనీలకు చేరుతున్నారు. పోలవరం ముంపునకు గురైన గోదావరి తీర గ్రామాల్లో ఇదీ నేటి పరిస్థితి.

- నాటి జ్ఞాపకాలు పదిలం
- ఖాళీచేసిన గ్రామాలకు వెళ్లి వస్తున్న పోలవరం నిర్వాసితులు
- తీరిక ఉన్నప్పుడల్లా అక్కడే గడుపుతున్న ముంపు గ్రామాల ప్రజలు
- పుట్టిపెరిగిన గ్రామాల్లో కుటుంబ సమేతంగా వంటావార్పు
- పోలవరం ప్రభావిత గ్రామాల్లో ఇదీ పరిస్థితి



దేవీపట్నంలో సరదాగా గడుపుతున్న ఓ కుటుంబం



పూడిపల్లిలో ఎంతో మంది ప్రముఖులు బస చేసిన జమిందారు ముత్యాల కొండలరావు ఇల్లు

**రంపచోడవరం:** ఎన్నో ఏళ్ల అనుబంధం పెనవేసుకున్న ఇంటికి చేరి కబుర్లు చెప్పుకుంటూ వంటావార్పు చేసుకుంటున్నారు. గుడిని, బడిని గోదావరిని తనివి తీరా చూసి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటున్నారు పోలవరం ముంపు గ్రామాల నిర్వాసితులు.

**ఎఫ్‌ఆర్‌ఎల్ స్థాయిలో నీరుంటే..**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి డ్యామ్‌లో ఎఫ్‌ఆర్‌ఎల్ స్థాయిలో నీరు నిల్వ ఉంటే గ్రామాలు ఇక ఎప్పటికి నీటిలోనే ఉంటాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా దేవీపట్నం మండలంలో 42 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. వీరికి ప్రభుత్వం పునరావాసం కల్పించడంతో గ్రామాలు వదిలి వెళ్లిపోయారు. ఇప్పుడు ముంపు లేకపోవడంతో పుట్టి పెరిగిన గ్రామాలపై మమకారం వారిని అప్పుడప్పుడూ సొంత ఊరి వైపు వెళ్లేలా చేస్తోంది.

**కుటుంబ సభ్యులతో వెళ్లి..**

కుటుంబ సభ్యులతో సొంత గ్రామానికి వెళ్లి వరదలు కారణంగా మునిగిపోయిన ఇళ్లు, గోడలు, మిగిలిన తమ ఇళ్ల వద్ద గడుపుతున్నారు. అక్కడే వండుకుని కుటుంబ సభ్యులతో కలిసి మనసారా భోజనాలు చేసి గత జ్ఞాపకాలను నెమరు వేసుకుని తిరిగి వస్తున్నారు.

**రెండు తరాలు కనుమరుగు**

పునరావాసం కాలనీలకు తరలి వచ్చిన తరువాత నిర్వాసితులు ఇప్పుడు ఉన్న వారి కంటే రెండు తరాల ముందు వారు కనుమరుగవుతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం నాటికే 60 సంవత్సరాల వయసు పైబడిన వారి వయసు ఇప్పుడు 80 సంవత్సరాలకు మించి పోయింది. దీంతో ఇప్పటికే చాలామంది కాలం చేశారు. పోలవరం ప్రాజెక్టుతో పాటుగా నది తీర గ్రామాలతో పాటు రెండు తరాలు ముందు వారు క్రమంగా కనుమరుగవుతున్నారు. అపార అనుభవం కలిగి ఆ తరం తరువాత తరాలకు తమ జ్ఞానాన్ని పంచే వారు. అయితే వీరంతా ఉప్పుడు నిర్వాసిత గ్రామాల్లో మనుగడ సాగిస్తున్నారు. వయసు పైబడిన వారితో పాటు వారి జ్ఞాపకాలు కనుమరగవుతున్నాయి.

**ఎంతో మందికి ఆతిథ్యం**

ఒకప్పుడు ఎంతో మంది సినీ ప్రముఖులకు ఆతిథ్యం ఇచ్చిన పూడిపల్లి గ్రామానికి ఎంతో పేరుంది. ఈ గ్రామంలో చిరంజీవి, బాలకృష్ణ, కృష్ణంరాజు, రావు గోపాలరావు, గొల్లపూడి మారుతీరావు, మీనాక్షిశేషాద్రి, రమ్యకృష్ణ, జయసుధ, శ్రీదేవి వంటి తారలు షూటింగులు నిమిత్తం బస చేసేవారు. ప్రేక్షకాదరణ పొందిన త్రిశూలం, బంగారు బుల్లోడు, ఆపద్బాంధవుడు వంటి సినిమాలు ఎక్కువగా ఈ ప్రాంతాల్లోనే చిత్రీకరించారు.



ముంపు నుంచి బయటపడిన దేవీపట్నం గ్రామం

## దేవీపట్నానికి ఎంతో ప్రాధాన్యం

గోదావరి నదిని ఆనుకొని ఉన్న దేవీపట్నం గ్రామానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ గ్రామంలో చోళ రాజులు నిర్మించిన పురాతన శివాలయం ఉంది. గ్రామానికి వెళ్లిన దేవీపట్నం వాసులు అక్కడ శివాలయాన్ని సందర్శిస్తున్నారు. ఈ ఆలయం కొండపై ఉండడంతో పోలవరం ప్రాజెక్టులో ఎప్పటికీ మునిగే ప్రస్తకే లేదు. దేవీపట్నం వెళ్లిన నిర్వాసితులు వేసవిలో గోదావరి ఒడ్డున కూర్చుని చల్లని గాలులు ఆస్వాదిస్తూ గడిచిన రోజులు గుర్తు చేసుకుంటున్నారు. వర్షాలు ప్రారంభమైతే పోలవరం ముంపు ప్రాంతాలకు వెళ్లే అవకాశమే లేదు. గోదావరి వరదలతో గ్రామాలు నీటిలో మునిగిపోతాయి. ప్రభుత్వం గిరిజన నిర్వాసితులకు ఏజెన్సీ ప్రాంతంలో, గిరిజనేతరులకు మైదాన ప్రాంతంలో పునరావాసం కల్పించింది. మత్స్యకారులు అక్కడే ఉంటూ చేపల వేటకు వెళ్తున్నారు. ఇందుకూరుపేటకు సమీపంలో నివాసం ఉంటున్నారు.



దేవీపట్నంలో శివలింగం

### మరుపురాని ఊరు

ఇక్కడే పుట్టి పెరిగిన దేవీపట్నం గ్రామం ఎప్పటికి మరిచిపోలేం. ఎన్నో అనుభూతులు పంచింది. ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న ఇలాంటి గ్రామం ఎక్కడా ఉండదు. గోదావరిలో తిరిగే లాంచీలో పనిచేసిన జ్ఞాపకాలు ఇప్పటికి మరిచిపోలేం. అవకాశం ఉన్నప్పుడు గ్రామానికి వెళ్లి వస్తున్నాం.

–తెలంగొట్టి భాస్కరరావు, దేవీపట్నం



అరకు/పాడేరు:

| ఇఫ్తార్ (మంగళ) | సహర్ (బుధ) |
| --- | --- |
| 6-14 | 4-21 |

రంపచోడవరం:

| | |
| --- | --- |
| 6-29 | 4-24 |

**రంజాన్ వేళలు**

## న్యూస్‌రీల్

### ఘనంగా ముత్యాలమ్మ జాతర ప్రారంభం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

**చింతపల్లి:** మండల కేంద్రం చింతపల్లిలో సోమవారం ముత్యాలమ్మ జాతర వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.జాతర సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయిబాబా ఆలయం నుంచి డిగ్రీ కళాశాల వరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలను అక్కడే నిలిపివేశారు. భక్తులను కాలినడకన వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. జాతర సందర్భంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారికి తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగు నీరు సరఫరా చేస్తున్నారు. వివిధ శాఖల అధికారులు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో స్టాళ్లు ఏర్పాటుచేశారు. భక్తుల సౌకర్యార్థం పోలీసులు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేశారు. అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ ఆధ్వర్యంలో దాదాపు 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని అదనపు ఎస్పీ తెలిపారు.

### 34 కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన వ్యక్తులు

**కొయ్యూరు :** మర్రివాడ పంచాయతీ దొడ్డవరం శివారులో ఆటో అడుగు భాగాన ఉంచి తరలిస్తున్న 34 కిలోల గంజాయిని పట్టుకుని ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో సోమవారం దొడ్డవరం శివారులో వాహనాల తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో చింతపల్లి ప్రాంతం నుంచి కాకరపాడు మీదుగా కత్తిపూడి హైవే నుంచి వెళ్లేందుకు ఇద్దరు ద్విచక్ర వాహనాలపై, మరో ముగ్గురు ఆటోపై వస్తున్నారు. పోలీసులను చూడగానే బైక్‌లను వెనక్కు తిప్పి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి కొయ్యూరు ఎస్‌ఐ రాజారావు పట్టుకున్నారు. తిరుపలికి చెందిన కావిడి వెంకటేశ్, గూడెంకొత్తవీధికి చెందిన ముప్పల గణేశ్, కృష్ణబాబు, చింతపల్లికి చెందిన కించె సన్యాసిరావు, పాంగి నాగేంద్రబాబులను రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

## కోవిడ్‌పై అప్రమత్తత అవసరం

అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ అనూష



**రంపచోడవరం:** కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ అనూష తెలిపారు. సోమవారం ఆమె కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అన్ని పీహెచ్‌సీల్లో కోవిడ్ సంబధింత మందులు, కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు రంపచోడవరం డివిజన్లో ఏడు కోవిడ్ కేసులు నమోదయ్యాయన్నారు. మాస్కులు, ధరించడంతోపాటు సామాజిక దూరం పాటించాలని సూచించారు. ఎవరికైనా మూడు రోజులకు మించి దగ్గు, తుమ్ములు, జలబు ఉన్నట్టయితే వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రిలో కోవిడ్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

**రాజవొమ్మంగి:** మండలంలోని లాగరాయి, రాజవొమ్మంగి పీహెచ్‌సీల పరిధిలో సోమవారం కోవిడ్ కేసులు నమోదైనట్టు వైద్యాధికారులు తెలిపారు. కింద్ర, దూసరపాములో వీటి ప్రభావం ఉందన్నారు. కోవిడ్ సోకిన వారిని హోం ఐసోలేషన్‌లో ఉంచాలని సూచించినట్టు వారు పేర్కొన్నారు.గుంపులు గుంపులుగా ఉండటం తగదన్నారు. కోవిడ్ నిబంధనలు తప్పకుండా పాటించాలని వారు సూచించారు.

### జి.మాడుగులలో వడగళ్ల వాన



సుర్మతి గ్రామంలో కురుస్తున్న వర్షం

**జి.మాడుగుల:** మండలంలోని పలు గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది. సింగర్బ, జీఎం కొత్తూరు, వైబీ గొందూరు, సుర్మతి, బందవీధి, నిట్టాపుట్టు, సొడేకు, కొత్తపల్లి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

## ఐటీడీఏ స్పందనకు 46 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

**రంపచోడవరం :** స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 46 వినతులు స్వీకరించారు. ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్‌కలెక్టర్ శుభం భన్సాల్, ఐటీడీఏ ఏపీవో (జనరల్) సీహెచ్ శ్రీనివాసరావు స్పందన నిర్వహించారు. మారుమూల గ్రామాలకు చెందిన గిరిజనులు వినతులు అందజేశారు. వీటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవి సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పీవో సూరజ్‌గనోరే తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డీఎస్ శాస్త్రి, ఈఈ డేవిడ్‌రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**అర్జీల్లో కొన్ని..**

- సిరిగిందలపాడు సీతపల్లి వాగు నుంచి 200 ఎకరాల బోదెలకు పూడికతతీత పనులు చేపట్టాలని అర్జీ అందింది.
- 516 జాతీయ రహదారిలో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందజేయాలని రైతులు వినతిపత్రం అందజేశారు.
- వైఎస్సార్‌జలకళ పథకంలో బోర్లు ఏర్పాటుచేసిన వారికి విద్యుత్ కనెక్షన్లు అందించాలని కోరారు.

## గిరిజనుల సేవే లక్ష్యం

నవనిర్మాణ సమితి ప్రాజెక్ట్ డైరెక్టర్ మణికంఠన్



మంచి నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న మణికంఠన్

**ముంచంగిపుట్టు:** గిరిజనులకు అన్ని విధాలుగా సేవ చేయడమే లక్ష్యంగా నవ నిర్మాణ సమితి పని చేస్తుందని ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మణికంఠన్ అన్నారు. మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీలోని జబడ, కోడాపుట్టు, మోలవుపుట్టు, దాబుగూడ, అత్తికల్ గ్రామాల్లో నవనిర్మాణ సమితి, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన మంచినీటి ట్యాంకులు, కొళాయిలను సర్పంచ్ త్రినాథ్ సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మణికంఠన్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో తమ సమితి ద్వారా అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తున్నామన్నారు. విద్య, ఆరోగ్యం, తాగునీరు తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. డిజైన్ ఇంజినీర్ వేణుగోపాల్, ఉపసర్పంచ్ సత్యం, సీనియర్ మేనేజర్ అభిరామ్, పంచాయతీ కార్యదర్శులు సోమేష్, ప్రశాంత్, వార్డు మెంబర్లు, సమితి ప్రతినిధులు, గిరిజనులు పాల్గొన్నారు.

## నాణ్యతగా నాడు–నేడు పనులు

- అక్రమాలు జరిగితే కఠిన చర్యలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక



హాజరైన అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

**సాక్షి,పాడేరు:** మనబడి నాడు–నేడు రెండవ విడత పనుల్లో అక్రమాలు జరిగినా, పనులకు హెచ్‌ఎంలు సహకరించకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో విద్యా, ఇంజనీరింగ్‌శాఖల అధికారులతో నాడు–నేడు పాఠశాలల అభివృద్ధి పనులపై ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నాడు–నేడు పనుల్లో అనేక ఫిర్యాదులు అందాయన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని రెండవ విడత పనులపై గట్టి నిఘా ఏర్పాటుచేశామని తెలిపారు. కొంతమంది హెచ్‌ఎంలు పనులకు సహకరించడం లేదని, నగదు అడుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిని గుర్తించి జిల్లాలోని కూనవరం వంటి శివారు ప్రాంతాలకు బదిలీ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. కొయ్యూరు, చింతపల్లి మండలాల్లోని నాలుగు పాఠశాలల హెచ్‌ఎంలు సహకారం అందించడం లేదని తమ వద్ద సమాచారం ఉందన్నారు. జూన్ 12వతేదీలోగా పనులు పూర్తి చేయించని పక్షంలో బదిలీ చేస్తూ అడ్వాన్స్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని పాఠశాలల్లో పనులు వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని సూచించారు. డుంబ్రిగుడ మండలంలో నది నుంచి అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో కొన్ని పాఠశాలల్లో పనులకు ఇబ్బందిగా మారిందని అధికారులు తెలిపారు. దీంతొ రూ.1.5 లక్షలు వెచ్చించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలానికి 25 బస్తాల సిమెంటును అదనంగా పంపిణీ చేసి పాఠశాలల్లో చిన్న మరమ్మతుల పనులు చేపట్టాలన్నారు. డీఈవో సలీంబాషా, సర్వశిక్ష ప్రాజెక్టు అధికారి పాత్రుడు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

**గ్రామసభల దృష్టికి భూరీసర్వే సమస్యలు**

భూముల రీసర్వేకు సంబంధించిన అభ్యంతరాలను గ్రామసభల దృష్టికి తీసుకువచ్చి, సమగ్రంగా చదివి వినిపించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని ఐటీడీఏ పీవోలు, సబ్‌కలెక్టర్లు, అన్ని మండలాల తహసీల్దార్లు, వీఆర్వోలు, సర్వేయర్లతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భూముల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. గ్రామసభలు నిర్వహించకుండా ప్రజల సంతకాలు తీసుకుంటున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ముసాయిదా భూముల రిజిస్టర్ తయారీపై తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.నోడల్ అధికారులు రీసర్వేపై సమీక్షలు జరపాలన్నారు.డీఫారం భూములు పట్టాలు పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. పౌరసేవల్లో జాప్యం ఉండకూడదన్నారు. భూముల రీసర్వేలో ఆలస్యంపై రంపచోడవరం డీటీపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.మూడేళ్లకు పైబడి ఒకే చోట పనిచేస్తున్న వీఆర్వోల జాబితా తనకు అందజేయాలని ఆదేశించారు. పీవీటీజీ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్ గనోరే, సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవ, డీఆర్వో అంబేద్కర్, సర్వేశాఖ ఏడీ మోహనరావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ
- సొంత నిధులతో సాయం



రాజవరం అగ్ని బాధితులను పరామర్శిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

**గంగవరం :** మండలంలోని రాజవరం అగ్నిబాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా తగిన విధంగా ఆదుకుంటామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఆదివారం రాజవరంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిల్లు దగ్ధమై 11 కుటుంబాలు నిరాశ్రయులవడం తెలిసిందే. వీరిని మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి సోమవారం బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించారు. బాధితులను ఓదార్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగిన నష్టం పరిహారం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అగ్ని ప్రమాదం వల్ల సంభవించిన నష్టం వివరాలను తహసీల్దార్ శ్రీమన్నారాయణ ఎమ్మెల్యేకు వివరించారు. రెవెన్యూ శాఖపరంగా తక్షణ సాయంగా బాధిత కుటుంబాలకు 20 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, వంటనూనె, గోధుమ పిండి అందించినట్టు ఆయన పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సిటిజన్ సంస్థ డైరెక్టర్ నిడమర్తి చినబాబు ఎమ్మెల్యేను కోరారు. అగ్ని బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఒకొక్క కుటుంబానికి రూ. రెండు వేలు, 20 కిలోల బియ్యం, కూరగాయలు, వంటనూనె, నిత్యావసర సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్‌ఎంపీపీలు కె.రామతులసి, కె.గంగాదేవి, ఎంపీడీవో బి. శ్రీనివాసులు, ఎస్‌ఐ చినబాబు, ఆర్‌ఐ ఫయాజ్‌బాషా, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, సూరంపాలెం ఎంపీటీసీ పద్మావతి, జియ్యంపాలెం, జగ్గంపాలెం, నెల్లిపూడి సర్పంచ్‌లు సుబ్బలక్ష్మి, లీలావతి, రమణమ్మ, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్ధార్థ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శారపు పావని, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్ పాల్గొన్నారు.

## చల్లంగా చూడమ్మా.. మారమ్మతల్లి



మారమ్మతల్లి అమ్మవారు



అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు



గరగమోస్తున్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో అమ్మవారి గరగ ఊరేగింపు
- గుండం తొక్కిన భక్తులు

**సీలేరు:** సీలేరు గ్రామదేవత మారమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 14వ తేదీన ఆలయం వద్ద జెండా ఎగురవేసి అమ్మవారి ఉత్సవాలను ప్రారంభించడం తెలిసిందే. మారమ్మతల్లి మాలలు ధరించిన 120 మంది మహిళలు, పురుషులు తమిళ అర్చకులు సుబ్రహ్మణ్యం, శ్రీను ఆధ్వర్యంలో అమ్మవారి గరగను ఏర్పాటుచేశారు. డప్పు వాయిద్యాల మధ్య కాలినడకన అగ్నిగుండం తొక్కుతూ గర్భగుడిలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. అనంతరం అగ్నిగుండం తొక్కారు. స్థానికులు భారీగా తరలివచ్చారు. బాణసంచా, విద్యుత్‌దీపాల వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈనెల 23న అమ్మవారి ప్రధాన పండగ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

## నిప్పుల కుంపటి!

- ఉమ్మడి విశాఖ కుతకుత
- అత్యధికంగా కోటవురట్లలో 43.56 డిగ్రీలు
- పద్మనాభం 41.36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- మరో మూడు రోజులు వడగాడ్పులు

**సాక్షి, విశాఖపట్నం:** ఉమ్మడి విశాఖ కుతకుతలాడుతోంది. ఉష్ణతాపం నిప్పుల కుంపటిని తలపిస్తోంది. సాధారణంకంటే నాలుగైదు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతూ దడ పుట్టిస్తున్నాయి. వరసగా వారం రోజుల నుంచి వడగాడ్పులు వీస్తూనే ఉన్నాయి. సోమవారం కూడా అవే సెగలు కొనసాగాయి. విశాఖ జిల్లా కంటే అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మరింతగా అదుపు తప్పాయి. అనేక ప్రాంతాల్లో 40–43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోకెల్లా అత్యధికంగా అనకాపల్లి జిల్లా కోటవురట్లలో 43.56 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో 42.42, విశాఖ జిల్లా పద్మనాభంలో 41.36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో రోజంతా వడగాడ్పులు వీచాయి. రోజూ కాస్తున్న ఎండలు, వీస్తున్న వడగాడ్పుల ధాటికి జనం విలవిల్లాడుతున్నారు. సూర్యోదయం అయిన రెండు మూడు గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. సాయంత్రం అయ్యేవరకు నిప్పులు కక్కుతూనే ఉన్నాడు. జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. తప్పనిసరి అయితేనే ప్రయాణాలు చేస్తున్నారు. వచ్చే మూడు రోజులు ఉమ్మడి విశాఖ జిల్లాలో వడగాడ్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. జనం ఎండ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### సోమవారం నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

| జిల్లా | ప్రాంతం | ఉష్ణోగ్రత |
| --- | --- | --- |
| అనకాపల్లి | కోటవురట్ల | 43.56 |
| అనకాపల్లి | దేవరాపల్లి | 42.82 |
| అనకాపల్లి | నర్సీపట్నం | 42.20 |
| అనకాపల్లి | చోడవరం | 41.43 |
| అనకాపల్లి | అనకాపల్లి | 40.61 |
| అల్లూరి | చింతూరు | 42.42 |
| అల్లూరి | కూనవరం | 41.60 |
| అల్లూరి | గంగవరం | 41.51 |
| విశాఖపట్నం | పద్మనాభం | 41.36 |
| విశాఖపట్నం | గంభీరం | 40.48 |
| విశాఖపట్నం | సింహాచలం | 40.00 |
| విశాఖపట్నం | మహారాణిపేట | 40.0 |

## క్లుప్తంగా

### రేపు 'తిరుమల'లో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జేఈఈ (మెయిన్స్), జేఈఈ (అడ్వాన్స్డ్), నీట్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహిస్తారు. ఈ మేరకు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో 10వ తరగతి తరువాత చేరబోయే వివిధ కోర్సుల గురించి, ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ పోటీ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధంగా ఉండాలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని తెలిపారు.

### సీఆర్పీఎఫ్ సేవలు



భోజనం ప్యాకెట్లు ఇస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్పీఎఫ్–డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు భోజన సదుపాయం కల్పించారు. వారపు సంత సమీపంలో ఏర్పాటుచేసిన శిబిరంలో సుమారు 195 మంది పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేసినట్టు బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు చెప్పారు. ఇన్స్పెక్టర్ వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.



# సంక్షేమ ప్రదాత సీఎం జగన్

**పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి**



వేటమామిడిలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

పాడేరు రూరల్ : రాష్ట్రంలో గతంలో ఏ ప్రభుత్వం హయాంలో అమలుచేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సంక్షేమ ప్రధాతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గాలిపాడు, బుర్రగొంది గ్రామాల్లో సోమవారం జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 40 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గిరిజనులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం అమలుచేసిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకమైన పాలన అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంతో ఉన్నారన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. స్థానికుల అనుమతితోనే వారి ఇష్టంతోనే ఇళ్ల వద్ద జగనన్న స్టిక్కర్లను అతికిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఏమైన సమస్యలు ఉంటే గ్రామ సచివాలయంలో ఫిర్యాదు చేయాలని, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ కొర్ర మంగమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, సర్పంచ్ కుర్రబోయిన సన్నిబాబు, మాజీ ఎంపీపీ మంగ్లన్నదొర, నాయకులు బాబూరావు, కన్నాపాత్రుడు, సూరిబాబు, చినశంకర్, పున్నలరావు తదితరులు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలతో పేదల జీవితాలకు భరోసా**

అడ్డతీగల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుచేస్తూ పేదల జీవితాలకు భరోసా కల్పిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని వేటమామిడి సచివాలయం పరిధిలోని వేటమామిడి, పైడిపుట్ట, పణుకురాతిపాలెం గ్రామాల్లో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని 278 గడపలను ఎమ్మెల్యే ధనలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎదగాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఒక్కరి ఖాతాల్లోకి నిధులు జమ చేస్తోందన్నారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి అగ్రస్థానం ఇచ్చి నిరుపేదలకు వాటిని దరిచేర్చారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా చెంతకే సేవలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. రాష్ట్ర రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, సర్పంచ్ మడకం రాజమ్మ, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా గైరమ్మ సారె ఊరేగింపు

- బంగారుమెట్ట, ఎల్‌బీ పురంలో గైరమ్మ పండగ
- వంటకాలతో భారీగా తరలివచ్చిన మహిళలు
- సారె ఊరేగింపులో పాల్గొన్న ప్రభుత్వవిప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట, ఎల్‌బీ పురం గ్రామాల్లో గైరమ్మ పండగ సందర్భంగా సోమవారం సాయంత్రం భారీగా సారె ఊరేగింపు నిర్వహించారు. ఐదేళ్లకోసారి నిర్వహించే గైరమ్మ సంబరానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఈ నెల 24న గైరమ్మ పండగ సందర్భంగా నిర్వహించిన సారె ఊరేగింపులో రెండు గ్రామాల మహిళలు వేలాదిగా తరలివచ్చారు. ఇళ్లల్లో తయారు చేసిన పలు రకాల వంటకాలతో సారె ఊరేగింపులో పాల్గొన్నారు. డప్పులు, వాయిద్యాలు, నేల డ్యాన్సులు, బాణసంచా వెలుగుల మధ్య ఉత్సాహంగా ఊరేగింపు జరిగింది. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సారె ఊరేగింపులో పాల్గొని శివపార్వతుల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పీఏసీఎస్ అధ్యక్షులు సాయం రమేష్, సర్పంచ్ మేరుగు కుమారి బాబూరావు, తమరాన శ్రీను, ఉత్సవ కమిటీ సభ్యులు తమరాన దాసు, దొండా శ్రీను, యెనుముల వాసు, సాయం శేషు, దొండా రాజా, కుమార్, తమరాన రమణ, కమలనాయుడు, మణికంఠ, జగ్గారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



వివిధ రకాల వంటకాలతో సారె ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

# గంజాయి అక్రమ రవాణాపై నిఘా



సిసిమెట్ల- వలస గ్రామాల మధ్య గంజాయి రవాణా అవుతున్నట్టు అనుమానమున్న ప్రదేశాలను తనిఖీ చేస్తున్న సీఐ రాంబాబు

వై.రామవరం: మండలంలోని సిరిమెట్ల- వలస గ్రామాల మధ్య రహదారిలో గంజాయి అక్రమ రవాణా అవుతుందన్న సమాచారంతో సోమవారం సీఐ వై.రాంబాబు ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేశారు. స్థానికుల సహాయ సహకారాలతో అనుమానస్పద ప్రదేశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ రాంబాబు మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా అవుతుందన్న జాడ తెలిస్తే తమకు తక్షణమే సమాచారం అందించాలని స్థానికులను కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు, వివరాలు గోప్యంగా ఉంచుతామని, పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.ఎస్ఐ ఎమ్ సంతోష్ కుమార్, సిబ్బంది, కోట సచివాలయ మహిళా పోలీసు శ్రీకన్య తదితరులున్నారు.

# రసాభాసగా గ్రామసభ

- ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తాం
- తహసీల్దార్ అనసూయ



మాట్లాడుతున్న తహసీల్దార్ అనసూయ

కూనవరం: ఎన్నో ఏళ్ళ క్రితం ఊరు వదిలి వెళ్లిన వారికి ఆర్అండ్ఆర్ సెస్ సర్వే పేర్లు నమోదయ్యాయని, స్థానికంగా ఉంటూ ఏటేటా వచ్చే గోదావరి వరదల్లో నానా అవస్థలు పడుతున్న వారు ఆ సర్వేలో పేర్లు లేకపోవడంపై పోలవరం నిర్వాసితులు అధికారులను నిలదీశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఆర్అండ్ఆర్ గ్రామసభ రసాభాసగా మారింది. సర్పంచ్ కట్టం రాజమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో తహసీల్దార్ కె.అనసూయ మాట్లాడుతూ ఊరిలో లేకుండానే సెస్ సర్వేలో నమోదైన వారిని గుర్తించి తమ దృష్టికి తీసుకొస్తే వారి పేర్లు తొలగిస్తామని చెప్పడంతో నిర్వాసితులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అలా చెపితే మాలో మాకు తగాదాలు సృష్టించడమే అవుతుందటూ మండిపడ్డారు. ఎవరు స్థానికులు, ఎవరు బయటి వారు అన్న విషయాన్ని గుర్తించాల్సింది వలంటీర్లు, వారికి రేషన్‌కార్డు, ఇంటిపన్ను, ఆధార్ వంటి సర్టిఫికెట్లు మంజూరు చేసేది అధికారులు వారికి తెలియకుండా ఇవ్వన్నీ ఎలా వచ్చాయో తెలపాలని పట్టుబట్టారు. దీనిపై కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం ఎస్ఐ బి.వెంకటేష్ జోక్యం చేసుకొని సెస్‌సర్వేలో పేర్లను మరోసారి గ్రామసభలో చదివి వినిపించారు. అనంతరం తహసీల్దార్ స్పందించి సచివాలయంలో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తామని, స్థానికేతరులను గుర్తించేందుకు ఈ బాక్సల వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, వీఆర్ పురం తహసీల్దార్ శ్రీధర్, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, వైస్ ఎంపీపీ బి.సాంబశివరావు, వీఆర్ఓ వెంకన్న, కార్యదర్శి సురేష్, వివిధ పార్టీల నాయకులుమరియాదాస్, గంగాధర్, గుజ్జాబాబు, మోహన్‌రావు, సునీత, భాస్కర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# 23న గురుకులాల ప్రవేశ పరీక్ష

కంచరపాలెం : రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి (2023–24) ఈ నెల 23న పరీక్ష నిర్వహించనున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లాలో 3, అనకాపల్లి జిల్లాలో 8 గురుకులాల్లో 5వ తరగతిలో 880 సీట్ల కోసం 3,496 మంది విద్యార్థులు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 880 సీట్లకు 1,969 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. 5వ తరగతి విద్యార్థులు http;//apgpcet.apcfss.in, ఇంటర్ విద్యార్థులు http;//apgpcet.apcfss.in/inter వెబ్‌సైట్ ద్వారా ఈనెల 18 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0891–2799641, 7207000723 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



# నిర్దేశిత సమయానికే దర్శనం

- ఈసారి ప్రొటోకాల్‌లోనూ టైమ్ స్లాట్స్ విభజన
- సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- చందనోత్సవానికి కలెక్టర్ ప్రత్యేక ఏర్పాట్లు



సాక్షి, విశాఖపట్నం : సింహగిరిపై ఉన్న వరహాలక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవానికి అధికార యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా స్వామివారి నిజరూప దర్శనం కోసం ఏటా లక్షలాది మంది భక్తులు సింహగిరికి చేరుకొని దర్శించుకుంటారు. భక్తులు పోటెత్తడంతో ఆ ప్రాంతంలో రద్దీ వాతావరణం నెలకొంటుంది. గత ఏడాది గతంలో టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ సమయంలో బోర్డు మెంబర్లు ఒకేసారి దర్శనానికి రావడంతో ఇబ్బందులు తలెత్తాయి. గంటపాటు దర్శన సమయంలో తోపులాటలు జరగడం పలు విమర్శలకు దారితీసింది. ఈసారి అలాంటి పొరపాట్లు దొర్లకుండా స్లాట్ల విభజనతో దర్శనం చేసుకునేలా కలెక్టర్ డా.మల్లికార్జున ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించారు. సింహాచలం ఈవో త్రినాథరావు, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, ఇతర అధికారులతో పలుమార్లు సమీక్ష నిర్వహించి ఏర్పాట్లుపై ప్రత్యేక శ్రద్ధవహించారు. గతేడాది వచ్చిన విమర్శలు ఈ ఏడాది రాకుండా నిజరూప దర్శనం ముగిసేంత వరకూ ప్రణాళికాబద్ధంగా దర్శనాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

**రూ.1000 టికెట్లకు 5 స్లాట్లు**

ఏటా నిజరూపదర్శనం వేకువ జామున మొదలవుతుంది. తొలుత ఏటా వస్తున్న సంప్రదాయం ప్రకారం ఆలయ అనువంశిక ధర్మకర్త కుటుంబీకులు స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ అనంతరం దేవదాయ శాఖ మంత్రి దర్శనం చేసుకోనున్నారు. గతంలో ఈ సమయంలో అస్తవ్యస్తంగా మారింది. ఇప్పుడా పరిస్థితి తలెత్తకుండా విభజించనున్నారు. బోర్డు మెంబర్లకు కూడా స్లాట్ ఏర్పాటు చేస్తున్నారు. బోర్డు మెంబర్లకు ఇచ్చే టికెట్స్‌లో ఫస్ట్ స్లాట్‌లో 1 ప్లస్ 5 మాత్రమే అనుమతించనున్నారు. బోర్డు మెంబర్ల వద్ద మిగిలి ఉన్న టికెట్స్‌ను స్లాట్–2, స్లాట్–3లో దర్శనానికి అనుమతిస్తారు. ప్రోటోకాల్‌లోనూ టైమ్ స్లాట్లుగా పంపించాలని భావిస్తున్నారు. ప్రతి టికెట్‌పైనా టైమ్ స్లాట్ నిర్దేశించనున్నారు. రూ.1000 టికెట్స్‌కు 5 స్లాట్స్‌గా విభజించారు. ప్రతి 3 గంటలకు ఒక స్లాట్ ఇవ్వనున్నారు. ఇలా టైమ్ స్లాట్స్ ఇవ్వడం వల్ల నిర్దేశించిన సమయానికి మాత్రమే భక్తులు వస్తారని, దీనివల్ల దర్శన రద్దీతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తవని అధికారులు భావిస్తున్నారు. టైమ్‌స్లాట్స్, పాసుల కేటాయింపు, టికెట్స్ జారీపై మంగళవారం లేదా, బుధవారం కలెక్టర్ డా.మల్లికార్జున అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

**ఆన్‌లైన్‌లో చందనోత్సవం టికెట్లు**

**నేటి నుంచి అందుబాటులోకి..**

సింహాచలం: సింహగిరిపై ఈనెల 23న జరిగే చందనోత్సవానికి రూ.300, రూ.1000 టికెట్లు మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో లభ్యమవుతాయని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. www.aptempeles.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా భక్తులు టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే సింహాచలంలోని యూనియన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంకుల్లో కూడా టికెట్లు విక్రయిస్తామని పేర్కొన్నారు. కాగా సింహాచలం దేవస్థానం చరిత్రలో చందనోత్సవం టికెట్ల విక్రయం ఆన్‌లైన్ ద్వారా జరపడం ఇదే తొలిసారి కావడం విశేషం.

### మలేరియా నివారణకు చర్యలు

గూడెంకొత్తవీధి: మలేరియా నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పీహెచ్‌సీ వైద్యాధికారి అచ్యుత్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సీలేరు మలేరియా సబ్ యూనిట్ అధికారి రీమల కన్నబాబు ఆధ్వర్యంలో సోమవారం దామనాపల్లి పంచాయతీ లింగవరంలో దోమల నివారణ మందు పిచికారీ పనులు ప్రారంభమయ్యాయి. సర్పంచ్ రామకృష్ణ, వైస్ సర్పంచ్ కాసులమ్మ పాల్గొన్నారు.

### బాబూరావు నాయుడు ఎన్నికపై హర్షం

జి.మాడుగుల: ఏపీ ఆదివాసీ జేఏసీ చైర్మన్‌గా రిటైర్డు ఐఏఎస్ అధికారి తమర్బ బాబూరావు నాయుడు ఎన్నిక పట్ల దండకారణ్య ఎంప్లాయీస్ ఆర్గనైజేషన్ (డీఈవో) అధ్యక్షుడు సమిరెడ్డి మాణిక్యం, ప్రధాన కార్యదర్శి ఎల్‌బీ కామేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

### పోర్టులో రికార్డు స్థాయి లోడింగ్

సాక్షి, విశాఖపట్నం : మరో అరుదైన రికార్డును విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) తన ఖాతాలో వేసుకుంది. ఇన్నర్ హార్బర్‌లో పోర్టు చరిత్రలో తొలిసారిగా అత్యధికంగా ఐరన్ ఓర్ ధాతువుల లోడింగ్ చేస్తూ రికార్డు సృష్టించింది. 1,02,200 మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్‌ని ఏకకాలంలో పార్సిల్ లోడింగ్ చేసినట్లు పోర్టు అధికారులు ప్రకటించారు. గతంలో లక్ష మెట్రిక్ టన్నుల లోడింగ్ మాత్రమే ఇప్పటివరకు రికార్డుగా ఉండేది. సోమవారం యూరో ప్రతీక్ ఇస్పాట్ లిమిటెడ్ సంస్థకు సంబంధించిన ఐరన్ ఓర్ ఫైన్స్‌ని టోత్రా షిప్పింగ్ సర్వీస్ ఏజెన్సీ ఈక్యూ9 బేబీ కేప్ వెసల్‌లో రికార్డు స్థాయిలో లోడ్ చేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు.

# కాఫీ ఘుమఘుమ

ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాఫీ క్యూరింగ్ సెంటర్‌లో కాఫీ శుద్ధీకరణ పనులు ఫిబ్రవరితో ముగిశాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో నర్సీపట్నంలో ఉన్న ఏకైక క్యూరింగ్ సెంటర్‌కు ప్రత్యేకత ఉంది. ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్‌లో పరిస్థితి ఆశాజనకంగా ఉంది. గత ఏడాది కంటే ఉత్పత్తి పెరగడంతో సుమారు రూ.7 కోట్ల వరకు ఆదాయం సమకూరనుందని ఏపీఎఫ్‌డీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

- నర్సీపట్నం క్యూరింగ్ సెంటర్‌లో ముగిసిన శుద్ధి పనులు
- ఈ ఏడాది 244 మెట్రిక్ టన్నుల కాఫీ గింజల క్యూరింగ్
- అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కాఫీ రూ.342
- గతేడాది కంటే ఉత్పత్తి పెరగడంతో రూ.7 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం



కాఫీ గింజలను వేరు చేస్తున్న కార్మికులు, (ఇన్‌సెట్) శుద్ధి చేసిన క్లీన్ కాఫీ

నర్సీపట్నం: ఏజెన్సీలో ఏపీఎఫ్‌డీసీ ఆధీనంలో 8 వేల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే కాఫీ గింజలను నర్సీపట్నంలోని క్యూరింగ్ సెంటర్‌లో శుభ్రం చేసి ఈ–వేలం ద్వారా విక్రయిస్తుంటారు. ఏడేళ్ల క్రితం వరకు ఈ కేంద్రంలో 1500 మెట్రిక్ టన్నుల నుంచి 2 వేల మెట్రిక్ టన్నుల వరకు కాఫీ గింజలను శుద్ధి చేసి విక్రయించేవారు. ప్రకృతి వైపరీత్యాలు, మావోయిస్టుల ప్రభావంతో కాఫీ గింజల ఉత్పత్తి 400 మెట్రిక్ టన్నులకు పడిపోయింది. కాఫీ ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పుడు ఐదు నెలలపాటు ముమ్మరంగా క్యూరింగ్ పనులు జరిగేవి. గత ఏడాది 180 మెట్రిక్ టన్నుల కాఫీని శుద్ధి చేసి అమ్మకం చేశారు. అప్పట్లో అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో రూ.390 పలకడంతో రూ.5.80 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది 244 మెట్రిక్ టన్నుల కాఫీని క్యూరింగ్ చేశారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో రూ.342 వరకు పలుకుతోంది. 106 మెట్రిక్ టన్నుల క్లీన్ కాఫీని ఈ–వేలం ద్వారా విక్రయించగా రూ.3 కోట్లు ఆదాయం వచ్చింది. మరో 138 మెట్రిక్ టన్నుల శుద్ధి చేసిన కాఫీ అమ్మకానికి సిద్ధంగా ఉందని కేంద్రం క్యూరింగ్ సెంటర్ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఏప్రిల్ నెలాఖరునాటికి మిగిలిన కాఫీ అమ్మకం జరుగుతుంది. గత ఏడాదితో పోలిస్తే మార్కెట్‌లో ధర అటు ఇటుగా ఉన్నప్పటికీ ఉత్పత్తి పెరగడంతో క్లీన్ కాఫీ అమ్మకం ద్వారా సంస్థకు సుమారు రూ.7 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



నర్సీపట్నంలోని కాఫీ క్యూరింగ్ కేంద్రం

**ఉత్పత్తి కలిసొచ్చింది**

కాఫీ దిగుబడితోపాటు అంతర్జాతీయ మార్కెట్‌లో విశాఖ ఏజెన్సీ కాఫీకి ధర కలిసొచ్చింది. గత ఏడాది కిలో కాఫీ రూ.390 పలికిన ధర ప్రస్తుతం రూ.342 వరకు ఉంది. ఈ ధర పెరిగే అవకాశం ఉంది. దిగుబడి పెరగడంతోపాటు ధర ఆశాజనకంగా ఉండటం వల్ల రూ.7 కోట్ల వరకు ఆదాయం రానుంది. అమ్మకానికి 138 మెట్రిక్ టన్నుల క్లీన్ కాఫీ సిద్ధంగా ఉంది. బ్రెజిల్ కాఫీ తగ్గడంతో ఏజెన్సీ కాఫీకి డిమాండ్ ఏర్పడింది.

–ఎన్.స్వర్ణలత, డివిజనల్ మేనేజర్, కాఫీ క్యూరింగ్ సెంటర్, నర్సీపట్నం